
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
గురువారం 10 అక్టోబరు 2024



పేదలకు అందుబాటులో వైద్యం
- విద్య, వైద్యానికి ప్రత్యేక నిధులు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
6లో




మెదక్‌లో పూలను కొంటున్న మహిళలు

మార్కెట్లు కిటకిట

పూలకు భలే డిమాండ్.. పెరిగిన ధరలు



సంగారెడ్డి రూరల్/మెదక్, అక్టోబరు 9 : బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రాలలో మార్కెట్లు కిటకిటలాడాయి. బంతి, తంగేడు, చామంతి, పట్టుకుచ్చు, బంతి, గునుగ పూలను కొనుగోలు చేసేందుకు మహిళలు భారీ సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు వ్యాపారులు పూల దుకాణాలను ఏర్పాటు చేశారు. పూలకు గిరాకీ విపరీతంగా పెరగడంతో ధరలను అమాంతం పెంచేశారు. మొన్నటివరకు కిలో బంతి పూలు రూ.50 నుంచి రూ. 60 ఉండగా పండుగ సందర్భంగా రూ.200 వరకు విక్రయించారు. చామంతి పూలు సాధారణ రోజుల్లో కిలో రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు బతుకమ్మ పండుగకు ఎలాగైనా పూలను కొనుగోలు చేస్తారని ఇదే అదునుగా భావించి పూలను రెట్టింపు ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చేసేదిలేక ఎంత ధర అయినా పూలను కొనుగోలు చేస్తున్నామని మహిళలు తెలిపారు.



సలసల కాగుతున్న నూనెలు

వంట నూనె ధరలు సలసల కాగుతున్నాయి. ఉన్నట్టుండి కిలోపై రూ.20 పెరిగింది. ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, పొద్దుతిరుగుడు నూనె ధరలు భగ్గుమంటున్నాయి. కేంద్రం విదేశీ దిగుమతులపై సుంకాన్ని పెంచడంతో నూనె ధరలు భారీగా పెరిగాయి. వంట నూనె ధర పెరగడంతో కల్తీ నూనె రంగ ప్రవేశం చేసే అవకాశముంది. నూనె హోల్‌సేల్‌గా లీటరు రూ.120 అమ్ముతుండగా చిల్లరగా రూ.135 చొప్పున విక్రయిస్తున్నారు. పొద్దు తిరుగుడు నూనె కొన్ని స్థానిక దుకాణాల్లో లీటరు రూ.140 చొప్పున అమ్ముతున్నారు. పూజలకు విక్రయించే వివిధ రకాల నూనెలు లీటరు ధర మొన్నటి వరకు రూ. 109 వరకు ఉండగా ఇవి ఇప్పుడు రూ.125కి చేరాయి.



ధర దడ!

పండుగ పూట.. మండుతున్న రేట్లు

- నిత్యావసర ధరలు పైపైకి
- పెరిగిన కాయగూరల రేట్లు.. కాగుతున్న నూనెలు
- కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి.. ఘాటెక్కిన అల్లం వెల్లుల్లి

మెదక్, అక్టోబరు 9: కూరగాయల ధరలు ఇటీవల విపరీతంగా పెరిగాయి. అన్ని రకాల కూరగాయలు అర్ధ సెంచరీ దాటేశాయి. చాలామంది కేజీ కూరగాయలు కొనేవారు అర కేజీ.. అరకేజీ కొనేవారు.. పావు కేజీతో సరిపెట్టుకుంటున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఆకు కూరలు, కాయగూరల పంట దెబ్బతింది. అలాగే, దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా అంతటా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో కూరగాయలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. బీన్స్, క్యాప్సికమ్, బీన్స్, చామగడ్డ కేజీ 80 రూపాయలు అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కాకర, గోకర, బెండ, దొండ, బీర, చిక్కుడు కాయ రూ.60 అమ్ముతున్నారు. 15 రోజుల క్రితం రూ.20 నుంచి 30 కిలో అమ్ముడుపోయిన టమాట ఇప్పుడు రూ.50కు చేరుకుంది. ఆలుగడ్డ, వంకాయ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ రేట్లు రూ.50కి విక్రయిస్తున్నారు. దీంతో వీటి రేట్లు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. పండుగ వేళ ధరలు ఇలా ఉంటే.. ఈసారి చేసుకోవడమెలా అని మధ్యతరగతి కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.

ఉల్లి మంట..

ఉల్లి ధర కన్నీరు తెప్పిస్తుంది. ఇప్పటికే కిలో ఉల్లి ధర 70 రూపాయలు పలుకుతుంది. నవంబర్ నెలలో ఉల్లి రేటు కిలోకు రూ.100 నుంచి 120కి పెరిగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో ఉల్లి కొరత, డిమాండ్ పెరగడం.. కొత్త పంట మార్కెట్‌లోకి ఇంకా రాకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఘాటెక్కిన అల్లం వెల్లుల్లి

అల్లం, వెల్లుల్లి సామాన్యులు కొనలేని పరిస్థితి ఉంది. కిలో వెల్లుల్లి ధర రూ.350, అల్లం రూ.200కు అమ్ముతున్నారు. ఎక్కువగా కేరళ, కర్ణాటక, తెలంగాణలోని జహీరాబాద్, కోహీర్ నుంచి అల్లం వెల్లుల్లి దిగుమతి చేసుకుంటున్నారు. దిగుమతులు తగ్గడంతో ధర పెరిగినట్లు తెలుస్తుంది. రేటు పెరగడంతో కొందరు అక్రమార్కులు కల్తీ పేస్టు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గల్లీలోని కిరాణా షాపుల్లో తయారీదారుల పేరు, తేదీలు లేని అల్లం వెల్లుల్లి పేస్టు డబ్బాలు

అదుపు లేని బియ్యం ధరలు

బియ్యం బ్రాండ్ల ధరలు అంతుచిక్కడం లేదు. జైశ్రీరాం రకం బియ్యం 25 కిలోల ప్యాక్ రూ. 1900 వరకు విక్రయిస్తున్నారు. గత సీజన్‌తో పోలిస్తే బియ్యం ధరలు 40 శాతం పెరిగాయని అంచనా వేస్తున్నారు. సోనామసూరి, హెచ్ఎంటీ తదితర బ్రాండ్ల ధరలు రెట్టింపయ్యాయి. అమ్ముతున్నారు.

దుస్తులు ధరలు సైతం

దసరా, బతుకమ్మ పండుగకు ప్రజలు నూతన వస్త్రాలు ధరించడం ఆనవాయితీ. గతంలో క్లాత్ కొనుగోలు చేసి ప్యాంటు, షర్టులను పురుషులు టైలర్ షాపుల్లో కుట్టించుకునే వారు. ప్రస్తుతం కుట్టు కూలీ రేట్లు పెరిగి పోవడం మూలంగా రెడీమేడ్ దుస్తులు కొనుగోలువైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ సీజన్‌లో రెడీమేడ్ దుస్తుల ధరలూ విపరీతంగా పెరిగాయి. యువతులు, మహిళలు దుస్తులను ధరలూ హెచ్చురేట్లకు అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు ఇష్టం వచ్చిన ధరలకు అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

కూరగాయల ధరలు(కిలో రూ.లలో)

అల్లం : 200	క్యారెట్ : 60
వెల్లుల్లి : 350	ఆలుగడ్డ : 50
బీన్స్ : 80	టమాట : 50
క్యాప్సికమ్ : 80	కీర : 50
చామగడ్డ : 80	వంకాయ : 50
ఉల్లిగడ్డ : 70	నిమ్మకాయలు : రూ. 20కి మూడు
బెండ : 60	కొత్తిమీర కట్ట : రూ.40 (ఒకటి)
దొండ : 60	ఆకుకూరలు : రూ.10 (చిన్న సైజు కట్టకు)
చిక్కుడు : 60	
బీర : 60	
పచ్చి మిర్చి : 60	
గోకర : 60	
కాకర : 60	


మెదక్ పట్టణంలోని ఓ దుస్తులు కొనుగోలు షాపులో సందడి

చిలప్‌చెడ్ మహిళా ఏఎస్ఐ ఆత్మహత్యాయత్నం

చిలప్‌చెడ్, అక్టోబరు 9: విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఏఎస్ఐ ఆత్మహత్యకు యత్నించారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ పోలీసుస్టేషన్‌లో సంగారెడ్డికి చెందిన సుధారాణి ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి స్టేషన్‌లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించగా గమనించిన ఇతర సిబ్బంది వెంటనే ఆమెను కిందికి దించి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐను వివరణ కోరగా.. మూడు రోజుల నుంచి సుధారాణి విధులకు రాలేదని, బుధవారం సాయంత్రం ఆలస్యంగా రావడంతో వివరణ ఇవ్వాలని అడిగానని తెలిపారు. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

పండుగ సెలవుల్లో పెట్రోలింగ్‌పై స్పెషల్ ఫోకస్ : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 9 : పండుగ సెలవుల్లో ప్రజలు ఊళ్లకు వెళ్తున్నందున పట్టణాల్లో దొంగతనాల నివారణ కోసం పోలీసులు పెట్రోలింగ్‌పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన చట్టాలపై అవగాహన ఉండి, నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన చేయాలన్నారు. నూతన చట్టాల ప్రకారం అవసరం ఉన్న కేసుల్లో ముందస్తుగా డీఎస్పీ అనుమతి పొంది ప్రథమ విచారణ చేసిన తర్వాతనే కేసును నమోదు చేయాలన్నారు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, మట్కా, గ్యాంబ్లింగ్‌పై దృష్టిసారించి, నేరస్థులను ముందస్తుగా బైండోవర్ చేయాలని ఆదేశించారు.


సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

సరస్వతీమాతగా వనదుర్గమ్మ

పాపన్నపేట, అక్టోబరు 9 : ఏడుపాయల ఆలయంలో ఏడో రోజైన బుధవారం వనదుర్గామాతను సరస్వతీదేవిగా అలంకరించారు. ఆలయంలోని గోకుల్‌షెడ్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి, రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆయన సతీమణి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడుపాయలను ప్రత్యేక ప్యాకేజీతో అభివృద్ధి చేస్తామన్నారు.

కలెక్టరేట్‌లలో బతుకమ్మ

మెదక్ అర్బన్, అక్టోబరు 9: మెదక్, సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణాల్లో బుధవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వివిధ శాఖల మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మహిళలతో కలిసి కలెక్టర్ క్రాంతి బతుకమ్మ ఆడారు. మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ జ్యోతి ప్రజ్వలన, పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందని, ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అన్నారు. పలు శాఖల ఉద్యోగులు తయారు చేసిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీఆర్డీఏ బతుకమ్మ ప్రథమ స్థానంలో నిలువగా.. ఉత్తమంగా నిలిచిన బతుకమ్మలకు బహుమతులు ప్రధానం చేశారు. ఉదయం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన 2కె రన్‌ను నిర్వహించారు.


బతుకమ్మతో కలెక్టర్ క్రాంతి


మెదక్ కలెక్టర్‌లో నిర్వహించిన వేడుకల్లో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కొత్త టీచర్ల.. కోలాహలం 7
తరలివెళ్లిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

పేదలకు అందుబాటులో వైద్యం

- విద్య, వైద్యానికి ప్రత్యేక నిధులు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



రాయికోడ్ మార్కెట్ పాలకవర్గం ప్రమాణోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్, అక్టోబరు 9: పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేవిధంగా గ్రామీణ ప్రాంతాలకు సబ్ సెంటర్లు, పీహెచ్‌సీ మంజూరు నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని రాయికోడ్, మునిపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారంలో పాల్గొని మాట్లాడారు. 12 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాయికోడ్‌లో మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. రూ.3 కోట్లతో ఐదున్నర టన్నుల సామర్థ్యం గల గోదాంలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశానని పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, స్థానికులు మార్కెట్ కమిటీని అభివృద్ధి చేసుకునేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మునిపల్లి మండలం కంకోల్‌లో కూడా గోదాం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సింగితంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం రూ.2.45 కోట్లను మంజూరు చేశామన్నారు. రాయికోడ్ క్రాస్‌రోడ్డు సబ్ సెంటర్ నిర్మాణం కోసం స్థల పరిశీలన జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో సింగూరు కాలువ మరమ్మతులకు రూ.170 కోట్ల నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వినయ్‌కుమార్, నాయకులు సిద్ధన్నపాటిల్, మల్లికార్జున్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు నాలుగు పతకాలు



మెడల్స్ సాధించిన విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 9: హన్మకొండలో ఈ నెల 7, 8వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లా నుంచి రెండు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించారని అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. రాఘవపూర్‌కు చెందిన గ్యార లీలా ఆనంద్, డేకథ్లాన్, హైజంప్ రెండు విభాగాల్లో రెండు కాంస్య పతకాలు, కొండపాక (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) విద్యార్థి నగేష్ అండర్-18 జావెలిన్‌త్రోలో వెండి పతకం, అండర్-18 షాట్‌పుట్‌లో ఎస్‌డీఏపీకు చెందిన వాసు వెండి పతకం సాధించారు. పతకాలు సాధించిన వీరిని పలువురు అభినందించారు.

కొత్త టీచర్ల.. కోలాహలం

ఇటీవల వెలువడిన డీఎస్సీలో ఫలితాల్లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు తరలివెళ్లారు. అధికారులు దగ్గరుండి పలు వాహనాల్లో వారిని తరలించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొత్త టీచర్ల కోలాహలం కనిపించింది. నియామకపత్రం చేతికందిన వేళ అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది.

- హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సందడిగా తరలివెళ్లిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు
- పలు గ్రామాల్లో సన్మాన కార్యక్రమాలు

● మనేపల్లిలో దంపతులకు కొలువు

వెల్దుర్తి, అక్టోబరు9 : వెల్దుర్తి మండలంలో పదిమంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. మనేపల్లి గ్రామానికి చెందిన భార్యభర్తలు సీహెచ్ దినకర్, అనూష ఇద్దరూ కొలువు సాధించారు. అలాగే అదే గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి, బండపోసన్‌పల్లి గ్రామానికి చెందిన నాగారపు ఆనంద్, చాకలి శ్రీనివాస్, మంగళపర్తి గ్రామానికి చెందిన జాలిగామ అనిల్, రెడ్డిపల్లి సత్యనారాయణ, వెల్దుర్తి పట్టణానికి చెందిన రవీందర్, కుకునూర్ గ్రామానికి చెందిన ఆకాంక్ష, అందుగులపల్లి గ్రామానికి చెందిన జ్యోతి టీచర్ ఉద్యోగాలను సాధించారు.

వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

ఖేడ్ నుంచి..

నారాయణఖేడ్, అక్టోబరు 9: నియోజకవర్గానికి చెందిన దాదాపు 100 మంది కొత్తగా టీచర్ ఉద్యోగాలు సాధించారు. వారందరూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాలను అందుకోవడానికి వెళ్లగా, హైదరాబాద్‌లో వారిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి రిసీవ్ చేసుకుని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



అభ్యర్థులు తరలివెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సిద్దిపేట డీఈవో శ్రీనివాస రెడ్డి

స్నేహితుల సన్మానం..

నారాయణఖేడ్ మండలం జూకల్‌కు చెందిన మచ్కూరి రవీందర్ స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. దీంతో బుధవారం ఖేడ్‌కు చెందిన అతడి స్నేహితులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

తరలివెళ్లిన అభ్యర్థులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 9 : 2024 డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థులు ఉద్యోగ నియామకపత్రాలు తీసుకోవడానికి సిద్దిపేట నుంచి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియానికి తరలివెళ్లారు. 259 మంది సిద్దిపేట, గజ్వేల్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సుల్లో బయలుదేరారు. ఈ బస్సులకు జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి పచ్చజెండా ఊపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ ఆఫీసర్స్, మండల విద్యాధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒకే గ్రామం నుంచి ఆరుగురు..

కల్హేర్, అక్టోబరు 9 : మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన ఆరుగురు టీచరు కొలువులు సాధించి బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. గ్రామానికి చెందిన సురేష్‌గౌడ్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక కాగా, జుమ్మ లక్ష్మణ్, కారెగామ అరుణ్‌రెడ్డి, జి.సతీష్‌కుమార్, కుమ్మరి స్వాతి, గోకని మల్లేశం ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. వారిని గ్రామస్థులు అభినందించారు.



జిల్లాలో 272 మంది టీచర్లు

మెదక్ అర్బన్, అక్టోబరు 9: మెదక్ జిల్లాలో అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 272 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. దీంతో మెదక్ నుంచి 6 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి అభ్యర్థులను తీసుకెళ్లారు.

పట్టుబట్టి.. కొలువు కొట్టి..

- పదహారేళ్లుగా ప్రయత్నం.. నాలుగుసార్లు తృటిలో దూరం
- తాజాగా స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన మహేందర్‌రెడ్డి

సిద్దిపేట, అక్టోబరు9 : పట్టుదలతో శ్రమిస్తే ఎంతటి లక్ష్యాన్నయినా సాధిస్తామని చెప్పడానికి కొండపాక మండలం ఎర్రవల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన మన్నెం మహేందర్‌రెడ్డి జీవితమే నిదర్శనం. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించాలనేది అతడి లక్ష్యం. అదే తపనతో డిగ్రీ తరువాత బీఈడీ పూర్తిచేశాడు. మొదటిసారిగా 2008లో ఆ తరువాత 2012, 2017, 2018లో డీఎస్సీ పరీక్ష రాసి ఒక్కమార్కుతోనే ఉద్యోగాన్ని కోల్పోయాడు. ఓ వైపు కుటుంబ పోషణ భారమవుతున్నా.. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూ తన గమ్యాన్ని మాత్రం వదులుకోలేదు. నాలుగుసార్లు ఉద్యోగం తృటిలో చేజారినా.. పట్టుదలను సడలించకుండా శ్రమించి తాజాగా కొలువు సాధించాడు. సిద్దిపేట జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో కేవలం 3 పోస్టులు మాత్రమే ఉన్నాయి. వేల సంఖ్యలో ఆశావహులు ఉన్నా ప్రతిభ కనబర్చి కేవలం ఒక్క మార్కుతోనే ఉద్యోగాన్ని సాధించి శభాష్ అనిపించాడు.



మహేందర్‌రెడ్డి

ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల మంజూరు చేయాలి

- సీఎంను కోరిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 9: ఖేడ్ నియోజకవర్గానికి మొదటి విడతలోనే ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని కోరారు. అందుకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు హామీనిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట తుంగతుర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మందుల సామేలు, మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

సోలార్‌లో ఉచిత శిక్షణ

- ప్రాజెక్టు డైరెక్టర్ అమిత్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 9 : ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తిచేసిన నిరుద్యోగ యువతకు సోలార్‌లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ అమిత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ సోలార్ ఎనర్జీ సంస్థ ద్వారా సూర్యమిత్ర స్కిల్ డెవలప్‌మెంట్ పథకం కింద ఈ శిక్షణను గ్రీన్ ఊర్జా టెక్నాలజీస్ అండ్ సిస్టమ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మూడు నెలల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఐటీఐ, డిప్లమాలో ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్, సివిల్, ఫిటర్, వెల్డర్, ఇన్స్ట్రుమెంటేషన్, మెకానికల్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల వయోపరిమితి 18 సంవత్సరాలు నుంచి 30 ఏళ్ల వరకు ఉండాలని, ఎంపికైన వారికి ఈ నెల 16వ తేది నుంచి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి ఉంటుందని, శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి సోలార్ సంబంధిత పరిశ్రమల్లో ఉద్యోగవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

నవంబర్ 8 నుంచి సీఎం రేవంత్ రెడ్డి టోర్నీ

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 9 : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నవంబర్ 8 నుంచి సీఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నేత, హైకోర్టు న్యాయవాది గడ్డం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం జన్మదినం సందర్భంగా నిర్వహించే ఈ టోర్నీలో విజేతకు రూ.2లక్షలు, రన్నరప్‌కు రూ.లక్ష, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కు రూ.50 వేలు, అత్యధిక వికెట్లు తీసిన వారికి రూ.25 వేలు బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకుల మద్దతుతో ఈ టోర్నీ నిర్వహిస్తున్నామని, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.



మారెడ్డి చెరువు బ్యాక్‌వాటర్‌తో మునిగిన పంటను కోసుకుని బయటకు తీసుకువస్తున్న రైతులు

చేతికొచ్చిన పంట నీటిపాలు

- మారెడ్డి చెరువు బ్యాక్‌వాటర్‌తో మునిగిన పొలాలు
- 25మంది రైతులకు నష్టం.. ఆదుకోవాలని వేడుకోలు

చేర్యాల, అక్టోబరు 9 : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను ఇటీవల కాలువల ద్వారా విడుదల చేయగా, చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామశివారులోని మారెడ్డి చెరువు(డ్యాం)లోకి భారీగా నీరు చేరింది. దీంతో బ్యాక్‌వాటర్‌తో నాగపురి గ్రామానికి చెందిన సుమారు 25మంది రైతుల పంట పొలాలు మునిగిపోవడంతో బోరున విలపిస్తున్నారు. ఆ పంటపొలాలను కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు కిందిభాగంలో పోతిరెడ్డిపల్లి శివారులో 2010లో మారెడ్డి చెరువు సామర్థ్యం పెంచి అభివృద్ధిపరిచారు. ఇందులోభాగంగా నాగపురికి చెందిన 170 ఎకరాలు, కడవేరుగుకు చెందిన 30ఎకరాల భూమి నీట మునుగుతుందని గుర్తించి ఆ రైతులనుంచి భూసేకరణ చేసి నష్టపరిహారం చెల్లించారు. కానీ రిజర్వాయర్ నుంచి చెరువును నింపుతున్న క్రమంలో నాగపురి గ్రామంలో మరో 30ఎ కరాల పంటపొలాలు నీట మునిగిపోతున్నాయి. రైతులకు నష్టం కలుగుతుందని తెలిసినప్పటికీ దేవాదుల అధికారులు ఇష్టానుసారం నీటిని విడుదల చేయడంతో 25మంది లబోదిబోమంటున్నారు. సుమారు రూ.15లక్షల పంటనష్టం వాటిల్లిందంటూ వాపోతున్నారు. పంటను కాపాడుకునేందుకు పలువురు వేకువజామునే ఇంటిల్లిపాది నడుంలోతు నీళ్లలోకి దిగి పంటను కోసారు. ఈ షయమై ప్రభుత్వంతో పాటు దేవాదుల అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

గూడూరులో ఘనంగా చండీయాగం

మెదక్, అక్టోబరు 9, శ్రీదేవీ శరన్నవరాత్రులలో భాగంగా బుధవారం మూల నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా శివంపేట మండలం గూడూరులోని శ్రీమన్మహా గణాధిపతి సహిత పార్వతీ సోమేశ్వరాలయంలో సరస్వతీ అష్టోత్తర, కుంకుమార్చన, శ్రీ లలితా సహస్రనామాలతో అర్చించారు. అనంతరం చండీయాగాన్ని దుర్గా ఉపాసకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో జరిపారు. నిత్యం ఉదయం, సాయంత్రం అమ్మవారికి ఖడ్గమాల, శ్రీసూక్తాలతో శాస్త్రోక్తంగా శోడషోపచార పూజలు జరుపుతున్నారు. మెదక్ పట్టణంలోని శిశుమందిర్‌లో దేవీ నవరాత్రోత్సవాలను నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం అన్న ప్రసాద వితరణ గావించారు. ఫతేనగర్ వీధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వాహకులు నిత్యాన్నదానం చేస్తున్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న దేవీ ఉపాసకులు రాజశేఖర శర్మ



తూప్రాన్‌లో ప్రైవేటు భవనం పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద

కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన

తూప్రాన్, అక్టోబరు 9: తూప్రాన్ పట్టణంలో కోర్టు ఏర్పాటుకు భవనాలను జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద బుధవారం పరిశీలించారు. రెండు ప్రైవేటు భవనాలను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రోడ్లు భవనాలశాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. పట్టణంలో వెజ్-నాన్ వెజ్ మార్కెట్ యార్డుకు ఎదురుగా ఉన్న కొక్కొండ శ్రీధర్‌రెడ్డి భవనం, పట్టణంలోని అల్లాపూర్ చౌరస్తా వద్దగల ఓ భవనాన్ని పరిశీలించారు. రెండు భవనాల అద్దెల అంచనా వేసి నివేదించాలని ఆమె రోడ్లు భవనాలశాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, సీఐ రంగ కృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దారు ప్రభుదాస్, ఎస్‌ఐ శివానందం, ఆర్‌ఐ నాగరాజు, న్యాయవాదులు బొడ్డు శ్రీనివాస్, ముత్తిగాళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈత నేర్పించబోతే ప్రాణం పోయింది

- ప్రమాదావశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

చిన్నకోడూరు, అక్టోబరు 9 : చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం ఓబులాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. నంగునూరు మండలం రాజగోపాల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కుల ఎల్లయ్య (38) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం ఉదయం ఎల్లయ్య తన సోదరుడు లక్ష్మణ్ కుమారుడైన భానుకు ఈత నేర్పించేందుకు గ్రామంలోని చెరువు బతుకమ్మ మెట్ల వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ముందుగా చెరువులోకి దిగిన ఎల్లయ్య ప్రమాదావశాత్తు నీటిలో పడి మునిగిపోయాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని చెరువులో గాలించగా ఎల్లయ్య మృతదేహం లభించింది. మృతుడి తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య భారతవ్వ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

నీట మునిగి గొర్రెల కాపరి..

టేక్మాల్, అక్టోబరు9 : ప్రమాదవశాత్తు నీట మునిగి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుసంగి గ్రామానికి చెందిన ముస్లాపురం యాదయ్య (50) సోమవారం ఉదయం గొర్రెలు కాసేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో శవమై తేలాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి తమ్ముడు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంజీరా నదిలో దూకి యువకుడి ఆత్మహత్య

మనూరు, అక్టోబరు 9: మంజీరా నదిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మనూరు మండలం రాయిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయిపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు, విజయలక్ష్మిల రెండవ కుమారుడు మున్నూరు రమేష్(26) బుధవారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, రమేష్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న బియ్యం

టేక్మాల్, అక్టోబరు9 : హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. 161 జాతీయ రహదారి బొడ్మాట్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం ఉదయం తనిఖీలు చేపట్టగా 35 క్వింటాల పీడీఎస్ తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహారాష్ట్రకు చెందిన బాలాజీ మారుతీ కుమార్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బియ్యాన్ని వెంకటేశ్వర రైస్ మిల్‌కు తరలించినట్లు టేక్మాల్ ఆర్‌ఐ సాయి శ్రీకాంత్ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ భర్తేష్‌కుమార్‌జైన్



అభివృద్ధి పనులను పరిశీలించిన డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్‌జైన్

జహీరాబాద్, అక్టోబరు 9 : జహీరాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు అబివృద్ధిపనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) భర్తేష్‌కుమార్‌జైన్ అన్నారు. బుధవారం ఆ రైల్వేస్టేషన్‌ను సందర్శించి పర్లీ నుండి హైదరాబాద్ వరకు కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, పట్టణంలో పలు రైళ్లను ఆపాలని, రైల్వేలైన్లను పునరుద్ధరించాలని బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బక్కయ్యగుప్త, విశ్వనాథ్, సుధీర్‌బండారీ డీఆర్‌ఎంకు విన్నవించారు. అలాగే రైల్వేస్టేషన్‌కు సమీపంలో బెల్టుషాపులను నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ రాములునేత కోరారు. కార్యక్రమంలో స్టేషన్‌మేనేజర్ మాధవ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహంతో పరిశ్రమ ఎదుట కుటుంబం ధర్నా


- బకాయిలు చెల్లించాలని డిమాండ్



పరిశ్రమ ఎదుట బైఠాయించిన కుటుంబం

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 9 : కాంట్రాక్టర్ మృతదేహంతో కుటుంబ సభ్యులు ధర్నా చేసిన సంఘటన మంగళవారం పాశమైలారం పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం చత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన సంజయ్ ప్రజాపతి(36) ఇస్నాపూర్‌లో నివాసముంటూ గతంలో పాశమైలారం వాలెంటీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కాంట్రాక్టర్‌గా పని చేశాడు. బుధవారం ఆకస్మిక ప్రమాదానికి గురై అతను మరణించాడు. దీంతో అతడి భార్య దుర్గ కుటుంబ సభ్యులతో కలిసి మృతదేహాన్ని పరిశ్రమ వద్ద ఉంచి బకాయిలు చెల్లించాలంటూ ఆందోళనకు చేపట్టింది. కాగా, 2015 వరకే బాధితుడు తమ వద్ద పనిచేశాడని, అప్పటివరకు అన్ని బిల్లులు క్లియర్ చేశామని యాజమాన్యం సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు తెలిపింది. అయితే బాధితురాలు మాత్రం 2019కి సంబంధించిన రూ.10,20,760 విలువగల బిల్లులను చూపిస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

సీడీసీ ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ



సంగారెడ్డి రూరల్, అక్టోబరు 9 : సంగారెడ్డి సీడీసీ ఛైర్మన్‌గా రాంరెడ్డి బుధవారం టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, షుగర్ పరిశ్రమ అధికారుల ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజనేయులు, ఆత్మ కమిటీ ఛైర్మన్ ప్రభు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జార్జి, సత్యనారాయణ, సిద్దన్న, చిరంజీవి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బతుకమ్మ వేడుకలు


శివ్వంపేటలో సద్దుల బతుకమ్మ సంబరాలు


జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది


మునిపల్లి: చిన్నచెల్మెడ అంగన్‌వాడీ కేంద్రంలో..


కంది: బ్యాతోల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నర్సాపూర్ మండలపరిషత్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు, సిబ్బంది


హత్నూర: చింతల్‌చెర్వులో బతుకమ్మ సంబురాలు


పుల్కల్: ముదిమాణిక్యంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బుధవారం బతుకమ్మ పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సాయంత్రం వేళ వాటిని ప్రధాన కూడళ్లల్లో ఉంచి మహిళలు, యువతులు, చిన్నారులు అనే తేడా లేకుండా బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. పలు గ్రామాల్లో సద్దులబతుకమ్మ సందడి నెలకొన్నది. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసి సామూహిక భోజనాలు చేశారు.

● కంది, అక్టోబర్ 9: కంది మండలంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బుధవారం ఊరూరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎద్దుమైలారంలో మాజీ సర్పంచ్ కాసాల మల్లారెడ్డి, బ్యాతోల్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, జుల్‌కల్‌లో మైనార్టీ నాయకులు జుబేర్‌లు ఏర్పాటు చేసిన బతుకమ్మ సందడి కార్యక్రమాల్లో ఫోక్ సింగర్‌లు భవానీ, శివరంజనీలు తమ ఆట, పాటలతో సందడి చేశారు. బ్యాతోల్, కంది, చిమ్నాపూర్, కవలంపేట, మామిడిపల్లి, అరుట్ల, చిద్రుప్ప, ఇంద్రకరణ్ తదితర గ్రామాల్లో మహిళలు బతుకమ్మలకు మొదటగా ఇళ్లలో పూజలు నిర్వహించిన అనంతరం వాటిని గ్రామంలోని ప్రధాన కూడళ్లలోకి చేర్చి బతుకమ్మపాటలు, కోలాటాలతో సందడి చేశారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

● జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మెప్మామహిళలతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది బతుకమ్మను ఆడారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

● మునిపల్లి: బతుకమ్మ పండుగ సందర్భంగా బుధవారం మునిపల్లి మండల పరిధిలోని చిన్నచెల్మెడ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కాగా మునిపల్లిలో గురువారం నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను గురువారం ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను నిజమ్మనం చేసే మునిపల్లి చెరువును పరిశీలించారు. అంతకు ముందు కంకోల్‌లో నర్సరీని, సబ్ సెంటర్, మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

● హత్నూర: మండల పరిధిలోని చింతల్‌చెర్వు గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు పాటలు పాడుతూ, బతుకమ్మ ఆటలుడుతూ ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.

● నర్సాపూర్: నర్సాపూర్ మండల పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయ ఆవరణలో మహిళా ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. ఎంపీడీవో మాధవీలతతో పాటు ఇతర సిబ్బంది బతుకమ్మలను వివిధ పూలతో పేర్చి వేడుకలను జరుపుకున్నారు.

● శివ్వంపేట: మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ మహేష్ గుప్తా మాజీ సర్పంచ్ నవీన్ గుప్తా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి పెద్ద చెరువు కట్టపై పెట్టి ఆడి పాడారు. పోయిరా బతుకమ్మ.. పోయిరావమ్మా అంటూ స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు పరస్పరం వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

సద్దులబతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

తూప్రాన్, అక్టోబరు 9: సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ సిబ్బందికి సూచించారు. బుధవారం తూప్రాన్ పెద్దచెరువు కట్టపై ఏర్పాట్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. సద్దుల బతుకమ్మ వేడుకల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగరాదని, ఏర్పాట్లలో లోటు లేకుండా చూడాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధు, వార్డు ఆఫీసర్ భాస్కర్, జవాన్లు ఇర్ఫాన్, వెంకటేశ్, వినోద్ పాల్గొన్నారు.

శివారు డివిజన్లలో మౌలిక వసతులకు పెద్దపీట

● రూ. 4.77కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు, అక్టోబరు 9: జీహెచ్‌ఎంసీ శివారులోని డివిజన్లలో మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎస్సీ శ్మశాన వాటిక, మున్నూరుకాపు ఫంక్షన్‌హాల్, అంబేడ్కర్‌కాలనీ, గౌతమీనగర్‌లలో రూ.4.77కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్లకు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


బొల్లారం: బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

బతుకమ్మ ఘాట్ ప్రారంభం

జిన్నారం, అక్టోబరు 9: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ ఉత్సవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బొల్లారం మున్సిపాలిటీలో రూ.77లక్షల వ్యయంతో నిర్మించిన బతుకమ్మ ఘాట్, హై మాస్ట్ లైట్లను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అక్కడే జంబి చెట్టును నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, హన్మంతరెడ్డి, నిహారికారెడ్డి, సుజాత, గోపాలమ్మ, నరసింహరాజు, వేణుపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కమిషనర్ మంగతాయారు, ఆర్‌వో నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి రూ.20లక్షల పరిహారం

జిన్నారం, అక్టోబరు 9: పరిశ్రమలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేతులమీదుగా రూ.20లక్షల నష్ట పరిహారాన్ని అందజేశారు. ఇటీవల జిన్నారం మండలం కాజీపల్లి పరిధి ఆరోర లఫ్ సైన్సు పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తూ ప్రమాదవశాత్తు సుంకరి యాదగిరి అనే వ్యక్తి మరణించాడు. మృతుడు మెదక్ జిల్లా మగ్దుంపూర్ గ్రామానికి చెందినవాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరగా.. ఆయన యాజమాన్యంతో చర్చించి, బుధవారం పరిహారాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

ప్రజల సౌకర్యం కోసమే బస్ షెల్టర్

హెటిరో పరిశ్రమ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి


అన్నారం సమీపంలో బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ భాస్కర్ రెడ్డి

గుమ్మడిదల, అక్టోబరు 9: ప్రజల సౌకర్యం కోసమే అన్నారం గ్రామ సమీపంలో అనోరా ఫార్మసీ పరిశ్రమ సహకారంతో బస్సుషెల్టర్ నిర్మించినట్టు మెట్రో గ్రూప్ ఆఫ్ పరిశ్రమ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుమ్మడిదల మండలం అన్నారం గ్రామశివారులోని అనోరా ఫార్మా సహకారంతో గ్రామ పరిధిలోని మెదక్ హైదరాబాద్ సమీపంలో బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఈ మేరకు డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, అనోరా ఫార్మసీ హెచ్‌ఆర్ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనోరా ఫార్మసీ పరిశ్రమల నుంచి ప్రజలకు కావలసిన సౌకర్యాలు కోసం తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మాజీ సర్పంచ్ జైశంకర్ గౌడ్, మండల నాయకులు మద్ది ప్రతాప్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టి రాజు, ఈవో సంగీత తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ ఆఫీసులో ఆయుధ పూజ

మునిపల్లి, అక్టోబరు 9: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మునిపల్లి విద్యుత్ కార్యాలయంలో బుధవారం పరికరాలను అధికారులు, సిబ్బంది శుభ్రం చేసి, ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ ప్రశాంత్, ఆర్టిజన్ జమాల్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు అమానుషం

రామచంద్రాపురం, అక్టోబరు 9 : సీఎం రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటారనే ఉద్దేశంతో పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తాము ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీసర్పంచ్ మల్లేశం సోమిరెడ్డి, కౌన్సిలర్ బాబ్జీ, లచ్చారాంనాయక్‌ను అదుపులోకి తీసుకొని హౌజ్ అరెస్టు చేశారు.

ఆలయ భూమిని స్వాధీనం చేసుకోవాలి

జిన్నారం, అక్టోబరు 9: మంగంపేటలో పరిశ్రమ కోసం కేటాయించిన స్థలంలో ఉన్న ఆలయం భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామసభలో అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మంగంపేటలో గ్రామసభ నిర్వహించారు. స్థానిక 55సర్వే నెంబరులో పరిశ్రమ కోసం కేటాయించిన స్థలంలో వెంకటేశ్వర స్వామి ఆలయం పేరిట ఉన్న రెండు గుంటల భూమిని గ్రామానికి కేటాయించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఊట్ల, మంగంపేట మధ్య ఉన్న నక్షబాట కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరారు. గ్రామసభలో ప్రత్యేక అధికారి మల్లేశం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలించిన ఏడీఏ

కంగ్టి, అక్టోబరు 9: మండలపరిధిలోని తుర్కవడగాం, రాజారా తండా, బోర్గి, జంగి తదితర గ్రామాల్లో బుధవారం ఏడీఏ నూతన్‌కుమార్ పత్తిపంటలను పరిశీలించారు. మొక్కలు ఎర్రబారి ఆకులు రాలిపోతున్నాయని రైతులు తెలిపారు. దీంతో సస్యరక్షణ చర్యల గురించి ఏడీఏ రైతులకు వివరించారు.

ఖేడ్ పీఆర్ ఏఈగా విద్యాసాగర్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 9: మండల పంచాయతీరాజ్ ఏఈగా విద్యాసాగర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నుంచి బదిలీపై ఖేడ్‌కు వచ్చారు. మనూరు, నాగల్‌గిద్ద మండలాలకు నూతనంగా రజనీకాంత్ బాధ్యతలు స్వీకరించారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి: సునీతారెడ్డి


చిలప్‌చెడ్ రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునితారెడ్డి

కౌడిపల్లి/చిలప్‌చెడ్/కొల్చారం, అక్టోబరు 9: కల్యాణలక్ష్మి పథకం నిరుపేద కుటుంబాలకు వరమని ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె పలు మండలాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెక్కులు ఆలస్యం కావడంతో అధికారులతో మాట్లాడి పట్టుబట్టి చెక్కులు తెప్పించానని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోనికి వచ్చి పది నెలలు గడిచినా తులం బంగారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని పేర్కొన్నారు. రెండు బతుకమ్మ చీరలు రెండు ఇస్తామని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు. కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 89 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాస్ ఇతర అధికారులు ఉన్నారు. చిల్ఎచెడ్‌లోని రైతువేదికలో 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాదిక్, ఎంపీడీవో ఆనంద్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కొల్చారం మండల పరిషత్ ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గఫూర్‌మియాతో పాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● తూప్రాన్/మనోహరాబాద్: తూప్రాన్ తహసీల్ కార్యాలయం వద్ద బుధవారం ఇన్‌చార్జి తహసీల్దారు ప్రభుదాస్ ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై 74 మందికి చెక్కులను అందజేశారు. అదేవిధంగా మనోహరాబాద్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 57 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ కౌశిక, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి

పెద్దశంకరంపేట, అక్టోబరు 9: భారతీయ సంసస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడానికి రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ నిరంతరం కృషి చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ కార్యవాహ బోల నాగభూషణం పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని పురవీధుల్లో స్వయం సేవకులు ప్రధాన గణవేష్‌తో పదసంచాలన్(కవాతు) నిర్వహించారు. అనంతరం సమావేశంలో నాగభూషణం మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి విశ్వగురువు లాంటిదన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ ప్రముఖ్ నాకాశి రవివర్మ, జిల్లా భౌతిక ప్రముఖ్ తోట రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, బండాల శ్రావణ్, ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ జైహింద్‌రెడ్డి, స్వయంసేవకులు పాల్గొన్నారు.


పెద్దశంకరంపేటలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల పదసంచాలన్

'ఆయిల్‌పామ్' సాగుతో అధిక లాభాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బాలశంకర్

కోహీర్, అక్టోబరు 9: ఆయిల్‌పామ్ పంట సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి సోమేశ్వర్రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బిలాల్‌పూర్‌లోని రైతు వేదికలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి సోమేశ్వర్రావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగు చేయాలనుకునే రైతులకు మొక్కలకు 90శాతం రాయితీ, డ్రిప్ ఏర్పాటుకు 80శాతం నుంచి వంద శాతం రాయితీ వస్తుందన్నారు. కోహీర్ మండలంలోనే ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కోహీర్ మండలం కొత్తూర్ (డి)లో ఆయిల్‌పామ్ మొక్కల పెంపకం నర్సరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలశంకర్, ఏడీఏ భిక్షపతి, హెచ్‌వో సునీత, ఏవో నవీన్‌కుమార్, గోద్రెజ్ డీజీఎం స్వీటి, గోద్రెజ్ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తుల్జాపూర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ


తుల్జా భవానీమాత సన్నిధిలో జహీరాబాద్ ఎంపీ

నారాయణఖేడ్, అక్టోబరు 9: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బుధవారం మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలోని తుల్జాపూర్ పుణ్యక్షేత్రానికి వెళ్లారు. అక్కడ ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ తుల్జాభవానీమాతను దర్శించుకున్నారు. ఎంపీ వెంట జిల్లా దిశ కమిటీ సభ్యులు ప్రకాష్‌రాథోడ్, న్యాల్‌కల్ మాజీ జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌శంకర్, నాయకులు ఉన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు

కొల్చారం, అక్టోబరు 9: క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పడతాయని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం కొల్చారం మండల పరిధిలోని కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బీఆర్‌ఎస్ మండల యువత విభాగం అధ్యక్షుడు సంతోష్ రావు ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి రూ.12 వేలు, రెండో బహుమతి రూ. 6 వేలు అందజేశారు.

చెర్లగోపులారంలో మహిళలకు చీరల పంపిణీ


చీరలను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు

కొండాపూర్, అక్టోబర్ 9: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతుందని బీఆర్‌ఎస్ పార్టీ యువనాయకుడు అనంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చెర్లగోపులారం గ్రామానికి చెందిన 300మంది మహిళలకు బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆయన చీరలను పంపిణీ చేశారు.

అర్టిజన్ కార్మికులందరినీ కన్వర్షన్ చేయాలి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 9: అర్టిజన్ కార్మికులందరినీ కన్వర్షన్ చేయాలని టీటీపీసీ జేఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్‌భవన్‌లో బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని అర్టిజన్ కార్మికులందరినీ కన్వర్షన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీటీపీసీ జేఏసీ సంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా రాములునాయక్, కన్వీనర్‌గా ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య


శ్రీశైలం (ఫైల్)

మునిపల్లి, అక్టోబరు 9: మండలకేంద్రంలో కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన మునిపల్లి గ్రామానికి చెందిన మన్నె శ్రీశైలం(51) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ నెల 5న తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందును తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య మన్నె అనుసూజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మునిపల్లి, అక్టోబరు 9: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేటకు చెందిన పరిగి సాయికిరణ్(29) కోహీర్ మండలం దిగ్వాల్‌లో బంధువు అంత్యక్రియలకు వెళ్లి తన భార్య వసంతతో కలిసి స్కూటీపై మంగళవారం సాయంత్రం తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మునిపల్లి మండలం బుదేరా చౌరస్తా వద్దకు చేరుకోగానే స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్‌ను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..


మృతి చెందిన వ్యక్తి

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 9: సంగారెడ్డి పట్టణ శివారులోని ఆర్యన్ ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ ఎన్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి చాలా రోజుల నుంచి కింది బజార్, హనుమాన్‌గుడి దగ్గర, దర్గా వద్ద భిక్షాటన చేస్తూ, రాత్రి సమయంలో హనుమాన్ గుడి వద్ద పడుకొనేవాడు. మృతుడి ఒంటిపై నలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నట్టు చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే 08455276333, 8712656718 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సర్వీస్ వైర్ చోరీతో డిపోకు నిలిచిన నీటి సరఫరా

నారాయణఖేడ్, అక్టోబరు 9: ఖేడ్ ఆర్టీసీ డిపోకు సంబంధించిన బోరు సర్వీసు వైర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లడంతో డిపోకు నీటి సరఫరా నిలిచిపోయింది. డిపోలో బస్సుల సర్వీసింగ్, తాగడానికి, ఇతర అవసరాల కోసం డిపో పక్కనే చాలా ఏళ్ల క్రితం బోరు వేసి కనెక్షన్ ఇచ్చి, బోరు చుట్టూ ఇనుప గ్రిల్‌ను ఏర్పాటు చేశారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు 500 మీటర్ల సర్వీసు వైర్‌ను అపహరించుకుపోయారు. బుధవారం బోర్ వేసినా నీరు రాకపోవడంతో వైర్ చోరీకి గురైనట్టు సిబ్బంది గుర్తించారు.

12 మంది పేకాటరాయుళ్లపై కేసు

నాగల్‌గిద్ద, అక్టోబరు 9: పేకాడుతున్న 12 మందిని పట్టుకొని కేసు నమోదు చేశామని నాగల్‌గిద్ద ఎస్‌ఐ బి.సాయిలు తెలిపారు. బుధవారం ఎస్‌ఐ స్థానిక విలేకరులతో వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. మండలపరిధిలోని ఔదత్‌పూర్‌లో పేకాడుతున్నారని పోలీసులకు సమాచారమందడంతో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.24 వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మంత్రాల పేర ఎవరినీ హింసించవద్దు

రామాయంపేట, అక్టోబరు 9: మంత్రాల పేరిట ఇతరులను హింసించడం, దాడులకు పాల్పడడంలాంటివి మానుకోవాలని రామాయంపేట ఎస్‌ఐ బాలరాజ్, తహసీల్దార్ రజని పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ప్రగతి ధర్మారంలో కుల బహిష్కరణలు, చేతబడులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల మంత్రాల నెపంతో దాడులకు తెగబడి చంపేయడం లాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని తెలిపారు. ఇకముందు ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


వెల్దుర్తిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వెల్దుర్తి/ రేగోడు, అక్టోబరు 9: సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ లాయక్ అలీ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద ప్రజలకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. అదేవిధంగా రేగోడు మండలంలోని ప్యారారం గ్రామంలో సైబర్ నేరాలపై ఎస్‌ఐ పోచయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. యువత ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు.